క్లుప్తంగా

పైపులైనుకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): స్థానిక ధనలక్ష్మీ కాలనీలోని తాగునీటి ట్యాంకు పైపులైనుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. 23న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'తొలగిన పైపు.... నిలిచిన నీటి సరఫరా' కథనానికి అధికారులు స్పందించారు. సంబంధితశాఖ సిబ్బంది బుధవారం ట్యాంకు లోపలి భాగంలో నుంచి నూతన పైపు ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి ట్యాంకు ద్వారా మిషన్ భగీరథ నీరు కాలనీకి సరఫరా అవుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పుష్పరాజ్ శకావత్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి తెలిపారు.

కాలుష్యపు కాటు

ఆ పరిశ్రమలపై చర్యలు తీసుకోండి



ముప్పిరెడ్డిపల్లి శివారులో కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమ

మనోహరాబాద్(తూప్రాన్): సాయంత్రం అయిందంటే చాలు నిత్యం పరిశ్రమ నుంచి వెలువడే విషవాయువు, దుర్వాసనతో తమకు ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మనోహరాబాద్ మండలం జాతీయ రహదారి పక్కన ముప్పిరెడ్డిపల్లి శివారులో గల కిషాన్ ఇండస్ట్రీస్ ఎల్‌ఎల్‌పీ పరిశ్రమ నిత్యం పరిశ్రమ నుంచి విషవాయువులను విడుదల చేస్తున్నారని, దీంతో తాము ఇండ్లలో ఉండే పరిస్థితి లేదని జీడిపల్లి, ముప్పిరెడ్డిపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషవాయువుతో పాటు దుర్వాసన వస్తుందన్నారు. ఇట్టి విషయమై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కూల్చిన వాటిని మళ్లీ నిర్మిస్తే చర్యలు

పంచాయతీ కార్యదర్శి సుభాష్



నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: కూల్చివేసిన అక్రమ కట్టడాలను మళ్లీ నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంద్రేశం గ్రామ పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. బుధవారం పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం గ్రామ పరిధిలో పీఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లో గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులను మించి భవనం నిర్మిస్తుండటంతో నోటీసులు జారీ చేశారు. అయినా వినకుండా పనులు చేస్తుండడంతో కూల్చివేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులు మేరకు నిర్మాణం చేపట్టాలని సుభాష్ తెలిపారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కాంగ్రెస్ నేత కాటా శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వం రైతు సంక్షేమం కోసమే కృషి చేస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జిన్నారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సంబరాల్లో కాటా శ్రీనివాస్‌గౌడ్ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ బుధవారం మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో మహిళలు నిండు కలశాలతో దత్తగిరి లోని జ్యోతిర్లింగాల వద్దకు తీసుకెళ్ళి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారికి అభిషేకం, హారతి తదితర పూజలు చేశారు.

మత్తుకు బానిస కావొద్దు



పాపన్నపేట(మెదక్): సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్ గౌడ్

పాపన్నపేట(మెదక్): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు ఆకర్షితులు కావద్దని సూచించారు.సెల్ ఫోన్‌లో అపరిచితులతో సంబంధాలు పెట్టుకోవద్దని, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని చెప్పారు.

మత్తు పదార్థాలతో అనారోగ్యం

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కావొద్దని ఎస్‌ఐ రాజు అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీరాయరావు సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతి విద్యార్థి భాగస్వాములు కావాలని సూచించారు.

మాదకద్రవ్యాలపై అవగాహన

నిజాంపేట(మెదక్): మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని నిజాంపేట ఎస్‌ఐ రాజేశ్ విద్యార్థులకు సూచించారు. నిజాంపేట మండల కేంద్రంతో పాటు కల్వకుంట, రజాక్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కల్పించారు.పాఠశాలల్లో విద్యార్థుల మాదక ద్రవ్యాల నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి

చేగుంట(తూప్రాన్): విద్యార్థులు మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మత్తుపదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల వాటికి బానిసలుగా మారిపోయి ప్రాణాలు తీసుకోవాల్సిన పరిస్థితులు వస్తాయని తెలిపారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

విద్యార్థులు డ్రగ్స్ బారిన పడవద్దు

కౌడిపల్లి(నర్సాపూర్): డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలతో జీవితం నాశనం అవుతుందని విద్యార్థులు వాటి బారిన పడవద్దని స్థానిక ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తునికి ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రమైన జెడ్పీ హైస్కూల్‌లో ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచి మంచి నడవడిని అలవాటు చేసుకోవాలని, మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయన్నారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణాకర్, షీ టీమ్, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులతోనే ట్రాక్టర్లు కొన్నాం

మాజీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి



నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు కొనుగోలు చేశామని మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ నిధులతో పంచాయతీలకు ట్రాక్టర్లు కొనుగోలు చేశారని నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే కొనుగోలు చేశామని, ప్రతీనెల ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వడంతో ట్రాక్టర్ల నెలసరి కిస్తులు చెల్లించామని, వాటిలో డీజీలు పోసి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ఇతర పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వాటిలో డీజీలు పోసేందుకు నిధులు ఇవ్వనందున ట్రాక్టర్లు పంచాయతీల్లో మూలనపడ్డాయని, ప్రభుత్వ సిబ్బంది బ్యాంకులకు నెలసరి కిస్తులు చెల్లించలేకపోతున్నారని జితేందర్‌రెడ్డి వివరించారు. మాజీ మంత్రిహరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డిలను విమర్శించేస్థాయి కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులుగౌడ్, ఆవుల రాజిరెడ్డిలకు లేదని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శేఖర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయితీలకు నిధులు ఇవ్వనందున గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని, పంచాయతీ కార్యదర్శులు అప్పుల పాలయ్యారని ఆయన చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు శివకుమార్, రాజేందర్‌నాయక్, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పని ఒకచోట.. వేతనాలు మరోచోట

ఉపాధ్యాయులకు ఇక్కట్లు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల పరిస్థితి విధులు నిర్వర్తించేది ఓ చోట వేతనాలు తీసుకునేది మరోచోట అన్న చందంగా కొనసాగుతోంది. మండలంలోని కొన్ని గ్రామాలతోపాటు చేగుంట మండలంలోని చెట్ల తిమ్మాయిపల్లి, పులిగుట్టతాండ, సాజుతాండ, వెనుకతాండ, నడిమితాండ, పోతినొెట్టిపల్లి, పోతాన్‌పల్లి, జిల్లాగుట్ట తాండాలను గతంలో మాసాయిపేట మండలంలో కలుపుతూ ప్రభుత్వం నూతన మండలంగా ఏర్పాటు చేసింది. నూతన మండలం ఏర్పడి యేళ్లు గడుస్తున్నా చేగుంట మండలంలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల వేతనాలు చేసే డీడీఓ మాత్రం ఇప్పటికీ చేగుంట ఎంఈఓ పరిధిలోనే ఉంది. దీంతో ఆయా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తపస్ సీనియర్ నాయకుడు రంగారెడ్డి వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చేగుంట డీడీఓను మాసాయిపేట డీడీఓగా మార్చి మాసాయిపేట ఎంఈఓ పరిధిలోనే వేతనాలు చేసేలా చూడాలని ఆయన కోరారు.

ఆయిల్‌పామ్‌తో వందశాతం భరోసా

ఉద్యానశాఖ జిల్లా డీడీ సోమేశ్వర్‌రావు



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న సోమేశ్వర్‌రావు తదితరులు

జహీరాబాద్ టౌన్: అయిల్‌పామ్ సాగు రైతులకు ప్రభుత్వం వందశాతం భరోసా కల్పిస్తుందని ఉద్యానశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సోమేశ్వర్‌రావు అన్నారు. మండలం పరిధి గోవింద్‌పూర్‌లోని వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఉద్యానశాఖ, గోద్రెజ్ అగ్రోవిట్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించి 250 ఎకరాల్లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సోమేశ్వర్‌రావు మాట్లాడుతూ.. అయిల్‌పామ్ సాగు చేసే రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, పంట భవిష్యత్‌లో లబ్ధి చేకూరుస్తుందని చెప్పారు. అయిల్‌పామ్ సాగు చట్టబద్ధతతో కూడుకుందన్నారు. జిల్లాలో 2025–26 సంవత్సరానికి 3,750 ఎకరాల లక్ష్యంగా నిర్దేశించుకుని 2500 ఎకరాల రైతుల పేర్లను నమోదు చేసుకున్నామని చెప్పారు. ఇప్పటికే 1024 ఎకరాలకు పరిపాలన మంజూరు ఇచ్చామన్నారు. అయిల్‌పామ్ సాగు కోసం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు ఇస్తామని తెలిపారు. జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంఘం మండలాల్లోని రైతులు అయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, జిల్లాలోని మిగతా ప్రాంత రైతులు ముందుకురావాలని చెప్పారు. అయిల్‌పామ్ గెలలను గోద్రెజ్ కంపెనీ కొంటారని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుని పంటలను సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి పండరి, సేరికల్చర్ అధికారి శ్రీనివాస్, గోద్రేజ్ కంపెనీ జిల్లా ఇన్‌చార్జి కొండల్‌రావు, ప్రతినిధి వెంకటేశ్వర్లు, అధికారులు మహేందర్‌సింగ్, మహేశ్, నవదీప్, పాండు, రైతులు పాల్గొన్నారు.

అనుమతిలేని స్కూళ్లపై చర్యలు తీసుకోండి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: పట్టణంలో అనుమతి లేకుండా ప్రారంభమైన ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కింది దొడ్డి సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంఈఓ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా పాఠశాలలను ప్రారంభించి.. ప్రవేశాలకు విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అసత్య ప్రచారాలతో విద్యార్థులను చేర్చుకుంటున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని నిర్మాణాలను నిలిపివేయండి

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారంలో గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాల పనులను ఆపివేయాలంటూ బుధవారం గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి అంజయ్య కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే గ్రామ ప్రధాన రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు వివాదం కొనసాగుతుందని, అది పరిష్కారం కాకుండానే గ్రామంలోకి వెళ్లే కుడి వైపున నిర్మాణాలు చేపట్టడం ప్రజలు అసౌకర్యానికి గురికావాల్సి వస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పరీక్షలు చేస్తున్న వైద్యుడు

పెద్దశంకరంపేట(మెదక్): పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని పీహెచ్‌సీ వైద్యాధికారి షరీఫొద్దీన్ అన్నారు. స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌లో వంట కార్మికులు, సిబ్బందికి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించి, రక్త నమూనాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణాబాయి, ల్యాబ్ టెక్నీషియన్ పౌల్, ఏఎన్‌ఎం రమాదేవి, ఎంపీ హెచ్‌ఏ వెంకటేశం, వార్డెన్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ లింక్ చేసుకోవాలని ఏఓ స్వప్న తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ సాగుభూమి ఉన్న ప్రతి రైతులు వ్యవసాయ అధికారుల వద్దకు ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్, లింక్ ఫోన్‌నంబర్ తీసుకుని వచ్చి ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ లింక్ చేసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఫార్మర్ ఐడీతోనే కేంద్ర ప్రభుత్వ పథకాలు రైతులకు వర్తిస్తాయని పేర్కొన్నారు. దీంతోపాటు పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి కోసం ఫిజికల్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు.

ప్రజాభిప్రాయ సేకరణ చేయాలి

పటాన్‌చెరు టౌన్: పచ్చటి గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చే నిర్ణయంపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. బుధవారం పటాన్‌చెరులో ఏర్పడిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో అనేక గ్రామాలను మున్సిపాలిటీలుగా మారుస్తూ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీల వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని గ్రామ పంచాయతీ హోదాను కోల్పోతే గ్రామీణ ఉపాధి హామీ పథకాలు వర్తించవని తెలిపారు. గ్రామ కంఠం భూముల్లో ఇంటి నిర్మాణం చేపట్టాలన్నా, రుణాల విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ దిశగా ముందుకు సాగాలని కోరారు.

విద్యతోనే సమస్యలు పరిష్కారం

ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



ఏడుపాయల్లో ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యులు

సంగారెడ్డి/జోగిపేట(అందోల్)/పాపన్నపేట(మెదక్): విద్యా వ్యవస్థ పటిష్టమైతేనే దేశంలో ఏ సమస్యకైనా సరైన పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ కళాశాలను, అందోలులోని గురుకుల పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. అంతకుముందు మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గమ్మను సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇప్పటివరకు 26 గురుకుల పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదికను అందజేశామన్నారు. తెలంగాణలో ఆకలినైనా భరిస్తారు కానీ, ఆత్మగౌరవాన్ని దెబ్బతింటే భరించలేరన్నారు. గురుకుల పాఠశాలలో బోధన, భోజనం ఎలా ఉందని అక్కడి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమం, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువాతో సత్కరించారు. వెంకటయ్య వెంట ఆర్డీఓ పాండు, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డిలతోపాటు కళాశాల, గురుకుల పాఠశాల సిబ్బంది ఉన్నారు.

పరిశ్రమ నిర్మాణ పనులు అడ్డగింత



పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేటలో పరిశ్రమ నిర్మాణ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. బుధవారం గ్రామ శివారులో ఫోమ్ పరిశ్రమ యాజమాన్యం నిర్మాణ పనులను చేపట్టేందుకు సిద్ధమైంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు నిర్మాణం వద్దకు చేరుకుని పనులను నిలిపివేశారు. ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. ఇప్పటికే కాలుష్యంతో సతమతం అవుతున్నామని, మరో పరిశ్రమను గ్రామశివారులో నిర్మించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించి అక్కడి నుంచి పంపించివేశారు. గ్రామ కార్యదర్శి పద్మ మాట్లాడుతూ పరిశ్రమ నిర్మాణం కోసం తాము ఎలాంటి ఎన్‌ఓసీ ఇవ్వలేదన్నారు. టీఎస్ఐపాస్ ద్వారా పరిశ్రమ యాజమాన్యం అనుమతులు పొందారని వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ తరలింపుపై నిర్లక్ష్యం ఎందుకు?

విద్యుత్ ఏడీఏపై రైతుల ఆగ్రహం



ఏడీఏను నిలదీస్తున్న రైతులు

అల్లాదుర్గం(మెదక్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తరలింపుపై అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గ్రామాన్ని సందర్శించిన విద్యుత్ ఏడీఏను రైతులు నిలదీశారు. అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో వ్యవసాయ బోరు మోటార్లకు విద్యుత్ సరఫరా చేసేందుకు ఓ రైతుకు చెందిన స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోతే మరమ్మతులు చేసేందుకు సిబ్బందికి ఇబ్బందిగా మారింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను 161 రహదారి పక్కన ఏర్పాటు చేయాలని రైతులు నిర్ణయించారు. అక్కడ గద్దెను కూడా నిర్మించారు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించేందుకు రెండు నెలల క్రితం పాత ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ తొలగించారు. దీంతో వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని రైతులు వాపోయారు. రెండు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్ తరలించడంలేదని, ఈ ఖరీఫ్ సీజన్‌లో తూకాలు వేయలేని పరిస్థితి నెలకొందని రైతులు ఏడీఏపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయన స్థానిక ఏఈతో ఫోన్‌లో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్‌కు వెంటనే కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు.



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రైతులు నిర్మించిన గద్దె

ఎమర్జెన్సీ గుర్తులు వెంటాడుతూనే ఉన్నాయి

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు



మాట్లాడుతున్న ఆంజనేయులు

మెదక్‌జోన్: దేశంలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయానికి 50 ఏళ్లు నిండిందని ఇది పూర్తిగా రాజ్యాంగ హత్యగా భావించిన రోజని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ రాజ్యాంగాన్ని ఖూనీ చేసి ఎమర్జెన్సీ నిర్వహించినట్లు చెప్పారు. ఆ నాటి చేదుగుర్తులు ఇంకా దేశ ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు సతీష్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న రాజిరెడ్డి

హత్నూర(సంగారెడ్డి): పేదలు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటే వారికి ముఖ్యమంత్రి సహాయనిధి వరంలా ఆదుకుంటోందని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. హత్నూర మండలంలోని పలు గ్రామాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4.53లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పేద ప్రజలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో అప్పటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్‌ను ప్రారంభించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, ఆత్మ కమిటీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి నాయకులు మణిదీప్ ,ప్రసాద్, వెంకటేశ్, పెంటయ్యపాటు పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డును తొలగించిన అధికారులు



రోడ్డును తొలగిస్తున్న అధికారులు

కంది(సంగారెడ్డి): హెచ్‌ఎండిఏ లేఅవుట్ భూముల్లో అక్రమంగా చేసిన రోడ్డును హెచ్‌ఎండీఏ అధికారులు బుధవారం తొలగించారు. కంది శివారులోని సర్వే నంబర్ 656లో గత ప్రభుత్వం హెచ్‌ఎండీఏ లేఔట్ కోసం సుమారు 68 ఎకరాల భూమిని అసైన్‌మెంట్ దారుల నుంచి తీసుకొని లేఅవుట్ ఏర్పాటు చేసింది. ఎకరాకు 600 గజాల ప్లాటును భూమిని సాగు చేస్తున్న రైతులకు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో కొందరు తమ భూములకు రోడ్డు కావాలని పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న హెచ్‌ఎండీఏ అధికారులు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో అక్రమంగా ఏర్పాటు చేసిన రోడ్డును తొలగించారు. అలాగే భూమి చదును పనులు కూడా ప్రారంభించి కొంచమేరా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. హెచ్‌ఎండీఏకు కేటాయించిన స్థలంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తామని తహసీల్దార్ రవి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ డీఈ ప్రసాద్, సీఐలు వెంకటరామిరెడ్డి, సతీష్‌తో పాటు ఎస్సైలు రవీందర్, విజయకుమార్,ఆర్‌ఐ రంగయ్య సిబ్బంది పాల్గొన్నారు.